# ముఖ్యమంత్రి అల్పాహార పథకం చారిత్రాత్మకం



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి



దేవునిపల్లిలో చిన్నారులకు బ్రేక్‌ఫాస్ట్ వడ్డిస్తున్న విప్ గంపగోవర్ధన్

బాన్సువాడ రూరల్, అక్టోబర్ 6 : రాష్ట్ర వ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకం చారిత్రాత్మకమైనదని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ మండలంలోని జక్కల్ దాని తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారాన్ని వడ్డించారు. విద్యార్థులతో కలిసి స్పీకర్ అల్పాహారాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం తీసుకున్న నిర్ణయంతో రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న దాదాపు 20 లక్షల మంది పేద విద్యార్థులకు రుచికరమైన అల్పాహారం అందుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లిష్ విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో 'మన ఊరు.. మన బడి' కార్యక్రమాన్ని అమలు చేసి ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, ఇంగ్లిష్ విద్యను అమలు చేస్తున్నారని సీఎం కేసీఆర్‌ను కొనియాడారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించేందుకు ప్రతి రోజూ రాగి జావాను అందించే కార్యక్రమాన్ని ఇప్పటికే చేపట్టి విజయంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ప్రతి రోజూ రుచికరంగా అల్పాహారం అందించేలా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. పథకం సక్రమంగా అమలు అయ్యేలా మండలస్థాయి అధికారి నుంచి జిల్లాస్థాయి అధికారుల పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఒక గ్రామంలో ఈ పథకం ప్రారంభించాలనే ఆదేశాల మేరకు జక్కల్‌దాని తండా ప్రభుత్వ పాఠశాలలో మొట్టమొదటి సారిగా ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు. సీఎం పరిపాలన స్వర్ణయుగమని స్పీకర్ కొనియాడారు. అనంతరం రూ.12లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంగ్యానాయక్, ఎంపీటీసీ సభ్యురాలు యశోద, మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు దొడ్ల నీరజావెంకట్రాంరెడ్డి, పద్మాగోపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నెర్రె నర్సింహులు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, బాన్సువాడ సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తహసీల్దార్ వరప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు వాజిద్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ నాయక్, రాజేశ్వర్ గౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రతన్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, చందర్, తండా పెద్దలు బస్సీనాయక్, హేమ్లా నాయక్, బస్సీ, రూప్‌సింగ్, పూల్‌సింగ్ పాల్గొన్నారు.

- **నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించేలా సీఎం కేసీఆర్ నిర్ణయం**
- **రుచికరమైన అల్పాహారం అందేలా అధికారులు పర్యవేక్షించాలి**
- **స్వర్ణయుగంలా సీఎం కేసీఆర్ పరిపాలన**
- **జక్కల్‌దాని తండా ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార పథకాన్ని ప్రారంభించిన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**

### బ్రేక్‌ఫాస్ట్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్

కామారెడ్డి, అక్టోబర్ 6 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో ఉన్న జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ శుక్రవారం ప్రారంభించారు. మొదట విద్యార్థులకు ఇడ్లీ, చట్నీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఎలాంటి ఆహారం తీసుకోకుండా పాఠశాలకు వచ్చి అలమటిస్తున్నారనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ విద్యార్థుల కోసం బ్రేక్‌ఫాస్ట్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇందూప్రియ, కామారెడ్డి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, వైస్ ఎంపీపీ ఉరుదొండ నరేశ్, కౌన్సిలర్లు కాసర్ల గోదావరి, కృష్ణాజిరావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి, గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీపతి యాదవ్, కాసర్ల స్వామి, నాయకులు పాల్గొన్నారు.

## కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి

మాచారెడ్డి, అక్టోబర్ 6 : జిల్లా కేంద్రంలో శనివారం కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పగడాల బాల్‌చంద్రం కోరారు. మండలం నుంచి వెయ్యి బైక్‌లతో జిల్లా కేంద్రంలో కేటీఆర్‌కు ఘన స్వాగతం పలకాలని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విజయ్‌కుమార్

కామారెడ్డి, అక్టోబర్ 6 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన హైదరాబాద్‌లోని బేగంపేట మహిళా కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. విజయ్‌కుమార్ ఉద్యోగోన్నతి పొంది ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా పని చేస్తున్న కిష్టయ్య ఆయనకు బాధ్యతలు అప్పగించారు. అధ్యాపకులు ఆయనను శాలువాతో సత్కరించారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌ను మార్యదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రకాంత్, రాజ్‌కుమార్, శంకర్, రామకృష్ణ, గణేశ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ గంగాధర్

బాన్సువాడ టౌన్, అక్టోబర్ 6 : బాన్సువాడ పట్టణంలోని తాడ్కోల్ చౌరస్తా నుంచి వాసవి స్కూల్ వరకు నూతనంగా చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ గంగాధర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేశ్, సభాపతి పీఏ భగవాన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, శ్రీనివాస్‌రెడ్డి, తులా శ్రీనివాస్, బీఆర్ఎస్ వార్డు అధ్యక్షుడు అందె రాజు, కాంట్రాక్టర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అక్కాపూర్‌లో గ్రంథాలయం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్, ఎంపీపీ నర్సింగ్‌రావు

మాచారెడ్డి, అక్టోబర్ 6 : మండలంలోని అక్కాపూర్ గ్రామంలో ముత్యాల నర్సింహారెడ్డి తన తండ్రి లక్ష్మీ నర్సింహారెడ్డి జ్ఞాపకర్థం రూ.11 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు శుక్రవారం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గ్రంథాలయానికి ఫర్నిచర్, పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా భవనం దాత ముత్యాల నర్సింహారెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పగడాల బాల్‌చంద్రం, సర్పంచ్ గడ్డం మమత, ఎంపీటీసీ లత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, వైస్ ఎంపీపీ నర్సింహారెడ్డి, గడ్డం బాబు, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

బీబీపేట్, అక్టోబర్ 6 : మండల కేంద్రంలోని టీఎస్ఎన్ఆర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు తుమ్మల అక్షయ, తుమ్మల అర్జున్ రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఉపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉమ్మడి జిల్లాల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల విభాగంలో 9వ తరగతి చదువుతున్న తుమ్మల అక్షయ, అండర్ -14 బాలుర విభాగంలో 6వ తరగతి చదువుతున్న తుమ్మల అర్జున్ ఇరువురు అక్కాతమ్ముడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రధానోపాధ్యాయుడితోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## విద్యార్థుల సంక్షేమమే కేసీఆర్ లక్ష్యం



పిట్లంలో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షిండే, జడ్పీ చైర్‌పర్సన్ శోభ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

పిట్లం, అక్టోబర్ 6: విద్యార్థుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. పిట్లంలోని బోయివాడ ప్రాథమిక పాఠశాలలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజుతో కలిసి సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేయడంతోపాటు వారితో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 'మన ఊరు – మన బడి'తో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుండడంతో ప్రభుత్వ బడుల్లోనే చదివేందుకు విద్యార్థులకు ఆసక్తిని చూపుతున్నారన్నారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన అల్పాహారాన్ని అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణలో కరివేపాకు, మునగ, చింత చెట్లను పెంచాలని, వాటితో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషకాలు కలిగిన ఆహారం అందించవచ్చన్నారు. అనంతరం ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్‌కు ఉపాధ్యాయులు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ విజయలక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు అన్నారం వెంకట్‌రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విజయ్, జొన్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సాగౌడ్, శశి, మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ రామ్మోహన్‌రావ్, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం





రామేశ్వర్‌పల్లి, శాబ్దిపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

భిక్కనూరు, అక్టోబర్ 6 : గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గాల్‌రెడ్డి అన్నారు. భిక్కనూరు మండలంలోని రామేశ్వర్‌పల్లిలో రూ. కోటీ 51 లక్షల 75 వేలతో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ప్రారంభోత్సవాలు చేశారు. హెల్త్ సెంటర్, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పద్మ, సర్పంచ్ పోతిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రైతు బం ధు సమితి మండల కన్వీనర్ రాంచంద్రం, ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, భిక్కనూరు మాజీ సర్పంచ్ నాగభూషణంగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజమౌళి, విండో చైర్మన్ భూంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ అమృతరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు అనంత్‌గౌడ్, వీడీసీ ఉపాధ్యక్షుడు స్వామి, నాయకులు, వార్డు సభ్యులు, వీడీసీ, విండో డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

కామారెడ్డి రూరల్, అక్టోబర్ 6 : కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు సుమారు కోటీ 5 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం చేశారు. బస్సు షెల్టర్, సబ్ సెంటర్ నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరేశ్, సర్పంచ్ యాదమ్మ పరశురాం, ఉప సర్పంచ్ నాగరాజు, బీఆర్ఎస్ నాయకులు కంచర్ల సిద్ధరాములు, గణేశ్‌గౌడ్, కిష్టాగౌడ్, లక్కాగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేష స్పందన

కామారెడ్డి, అక్టోబర్ 6 : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సంస్థ, సాందీపని కాలేజ్ ఎన్ఎస్ఎస్ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 45 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పోలబాయిన సత్యం, కార్యదర్శి రాజనరసింహారెడ్డి, కోశాధికారి సుధాకర్, వెంకటరమణ, కృష్ణమూర్తి, కాశినాథం, నాగభూషణం, కిరణ్, సాందీపని విద్యా సంస్థల చైర్మన్ హరిస్మరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మాచారెడ్డి, అక్టోబర్ 6 : ఆయిల్‌పామ్ సాగుపై భవానీపేటలో కామారెడ్డి ఏడీఏ అపర్ణ శుక్రవారం అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు 90 శాతం సబ్సిడీపై బిందు సేద్యం, అంతర పంట కోసం ఏడాదికి రూ.4,200 ప్రభుత్వం అందజేస్తున్నదని తెలిపారు. పూర్తి వివరాలకు డ్రిప్ ఇరిగేషన్ కంపెనీ అధికారులను సంప్రదించాలని కోరారు. మండల ఏవో రమ్యశ్రీ, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.